క్లుప్తంగా

కేఎంసీకి పూర్వ ఆర్‌ఐలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్‌లో ఆర్‌ఐలుగా విధులు నిర్వర్తించి ఇతర మున్సిపాలిటీలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులు పలువురు మంగళవారం కార్యాలయానికి వచ్చారు. కేఎంసీ పరిధిలో అసెస్‌మెంట్ల నంబర్ల కేటాయింపుపై విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతోంది. దీంతో నంబర్లు కేటాయించిన సమయాన విధులు నిర్వర్తించిన ఉద్యోగులు నివేదికలు ఇచ్చేందుకు వచ్చినట్లు తెలిసింది.

బీమా చెక్కు అందజేత

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన సాయిజ్యోతి స్వయం సహాయక సంఘం సభ్యురాలు రావెళ్ల లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె ఇన్సూరెన్స్ చేయించుకోవడంతో మంజూరైన రూ.3 లక్షల చెక్కును మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ మృతురాలి కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ సురేఖ, గ్రామ పెద్దలు జిల్లపల్లి నాగేశ్వరరావు, వంగూరి వెంకటేశ్వర్లు, వంగూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి ఆర్థికసాయం..



నగదు అందిస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు

కూసుమంచి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈనేపథ్యాన మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18 కుటుంబాలకు ఇట్టి ఆర్థిక సాయాన్ని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, నాయకులు మాదాసు ఉపేందర్, కొమిరెల్లి అలింగ గోవిందరెడ్డి, భీష్మాచారి, చిలకబత్తిన రామారావు, ఇంటూరి పుల్లయ్య, జీవన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఉపేందర్, మల్సూర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అడ్డగింత..



అడ్డుకుంటున్న పెద్దాస్పత్రి కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దాస్పత్రి కార్మికులు ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. ఆస్పత్రిలో ఎక్కడ చెత్త అక్కడ పేరుకొని పారిశుద్ధ్య సమస్య ఏర్పడడంతో అధికారులు మున్సిపల్ కార్మికులను పిలిపించగా.. వారిని అడ్డుకున్నారు. జీతాల కోసం ధర్నా చేస్తుంటే మీరెలా వస్తారని వారితో వాగ్వాదానికి దిగడంతో కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినకపోవడంతో మున్సిపల్ కార్మికులు వెనుదిరిగారు. రెండు నెలలకు సంబంధించిన వేతనాలను కాంట్రాక్టర్‌కు చెందిన చైతన్య జ్యోతి అకౌంట్‌లో జమ చేసినట్లు ఆస్పత్రి అధికారులు తెలపగా.. బుధవారం ఉదయం కల్లా జమవుతాయని ఆర్‌ఎంఓ డాక్టర్ బి.రాంబాబు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కుబేర
వినోద	సితారే జమీన్ పర్
ఆదిత్య	8 వసంతాలు
శ్రీనివాస	కుబేర

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	32	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	42		20
కాకర	66	చుక్కకూర	3
బీర	26		20
దొండ	38	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	56	గోంగూర	4
గోరుచిక్కుడు	40		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	32		40
క్యారెట్	50	పుదీన	1
బీట్‌రూట్	40		20
క్యాప్సికం	80	-ఖమ్మం వ్యవసాయం	



'ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో ముందుంచేలా ఏడాది కాలంగా అనేక ప్రణాళికలు అమలు చేశాం. పచ్చదనం, పరిశుభ్రత కోసం మొక్కలు నాటి సంరక్షించాం. శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచాం. కుక్కలు, కోతుల బెడదకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ప్రభుత్వ సంక్షేమ పథకాల సర్వేలు, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాం. గతేడాది వచ్చిన వరదలను సమర్థంగా ఎదుర్కొన్నాం. మంత్రులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. డంపింగ్‌యార్డ్‌లోని 8 ఎకరాల స్థలాన్ని శుభ్రం చేసి, మొక్కలు పెంచుతున్నాం. పౌర సేవలను వేగవంతం చేయడంతో పాటు వికేంద్రీకరణకు ప్రణాళికలు చేశాం' అని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. బుధవారంతో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– ఖమ్మంమయూరిసెంటర్

ప్రణాళికతో ముందుకు..

- పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత
- కుక్కలు, కోతులపై ప్రత్యేక కార్యాచరణ
- మునుపెన్నడూ లేనివిధంగా కేఎంసీకి రూ.35 కోట్ల ఆదాయం
- ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్ల విస్తరణ

'సాక్షి'తో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

పారిశుద్ధ్యమే ప్రధాన అజెండా..

60 డివిజన్లతో విస్తరించి ఉన్న ఖమ్మం నగరాన్ని కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పారిశుద్ధ్యమే ప్రధాన అజెండాగా పనిచేశాం. ఇందు కోసం కాంట్రాక్ట్ పద్ధతిన 200 మంది కార్మికులను తీసుకుని కొత్తగా కొన్న ట్రాక్టర్ల ద్వారా గ్యాంగ్‌వర్క్ చేపించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచాం. పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించి పర్యవేక్షణకు వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు కేటాయించాం. జవాన్లకు త్వరలోనే వాకీటాకీలను అందజేస్తాం. 900 మంది కార్మికులకు ప్రమాద బీమా చేయించి, వారి పిల్లల కోసం స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులు ఉచితంగా నేర్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. పెద్దాస్పత్రి వద్ద కైండ్‌నెస్ వాల్ నిర్మాణంతో పాటు కేఎంసీలో దివ్యాంగుడితో జిరాక్స్ సెంటర్ ఏర్పాటు చేయించి ఉపాధి కల్పించాం.

ప్రజల సహకారంతో..

నగరంలో ఇరుకు రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరిస్తున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ నుంచి బ్రాహ్మణబజార్ వైపు వెళ్లే రోడ్డుతో పాటు రైల్వే స్టేషన్, చెరువుబజార్ రోడ్ల విస్తరణ పనులు ప్రారంభం కాగా పీఎస్‌ఆర్ రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేశాం.

కుక్కలు, కోతుల బెడదకు చెక్..

కుక్కలు, కోతుల సమస్యలపై ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు చాలా వినతులు అందించారు. కుక్కల నియంత్రణ కోసం ఏబీసీని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఇక కోతులను పట్టించి దూర ప్రాంతాల్లోని అడవులకు తరలిస్తున్నాం.

రూ.35 కోట్ల ఆదాయం..

కేఎంసీ ఆదాయాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.35 కోట్లకు చేర్చాం. ఇది గతంతో పోలిస్తే ఎక్కువే. అండర్ అసెస్‌మెంట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాం. అదనపు నిర్మాణాలు జరిగినా పాత పన్నులే చెల్లిస్తున్న వారికి రివైజ్డ్ పన్ను విధిస్తాం.

వరదల అనుభవంతో..

కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే మున్నేరుకు గతంలో ఎప్పుడు రానంతగా వచ్చింది. ఆ సమయాన ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవడంతో పాటు కొద్ది రోజుల్లోనే ఆయా ప్రాంతాలను పూర్వస్థితికి తీసుకురాగలిగాం. ఇదొక మంచి అనుభవాన్ని నేర్పాయి.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి..

నగరంలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారుల ఎంపికల కోసం చేపట్టిన సర్వేలను పకడ్బందీగా నిర్వహించాం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ఇప్పటికే మూడుసార్లు సర్వే పూర్తిచేసి మరోమారు నిర్వహిస్తున్నాం.

పని చేయని వారిపై చర్యలు..

కార్యాలయం నుంచి అందించే పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాం. విధుల్లో అలసత్వం వహించినా, పలు ఆరోపణలు ఉన్న వారిని పక్కన పెడుతున్నాం. రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేస్తున్నాం. ఇప్పటికే ఇద్దరి ఆర్‌ఐలను తొలగించాం. మరి కొంత మందిని తొలగించి కొత్తవారిని నియమిస్తాం.

జోనల్ కార్యాలయాల ద్వారానే..

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు జోనల్ కార్యాలయాలను తీసుకొచ్చాం. పలువురు అధికారుల బదిలీలు, టౌన్‌ప్లానింగ్‌లో టీపీఎస్‌ల కొరత వలన వీటిని ప్రారంభించలేకపోయాం. కొత్తగా టీపీఎస్‌లు చేరిన తర్వాత సేవలను ప్రారంభిస్తాం.

డంపింగ్‌యార్డ్‌లో మొక్కలు..

నగరంలో డివైడర్లలో, పార్కులు, ప్రకృతి వనాలతో పాటు డంపింగ్‌యార్డ్‌లో మొక్కలు నాటాం. 8 ఎకరాల డంపింగ్‌యార్డు స్థలాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటించాం. ఇక సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కొత్త ప్రాజెక్ట్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. ఇందుకు డీపీఆర్‌ను సిద్ధం చేశాం. ప్రభుత్వం అనుమతి ఇచ్చి, నిధులు మంజూరు చేస్తే చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

పీఎస్‌ఆర్ రోడ్డు విస్తరణకు మార్కింగ్



రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం త్రీటౌన్‌లోని పొట్టి శ్రీరాములు రోడ్డుకు మహర్దశ పడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి అభివృద్ధికి అధికారులు నడుం బిగించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో ప్రస్తుతం 40 ఫీట్లుగా ఉన్న రహదారిని 60 ఫీట్లకు విస్తరించేలా ఉద్యోగులు మంగళవారం మార్కింగ్ చేశారు. వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఆ రహదారి ఖమ్మం ఆవిర్భావం నుంచి ఉంది. శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి ఆలయం ఎదురు నుంచి హర్కారాబావి సెంటర్ మీదుగా మార్కెట్‌కు 40 ఫీట్ల వెడల్పుతో ఉంటుంది. ఈ ప్రాంతమంతా వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం రద్దీగా ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. గతంలోనే హర్కారాబావి సెంటర్ నుంచి మార్కెట్ వరకు రహదారిని అభివృద్ధి చేశారు. ఇప్పుడు గుంటుమల్లన్న ఆలయం నుంచి హర్కారా బావి సెంటర్ వరకు 40 ఫీట్ల రహదారిని 60 ఫీట్లకు విస్తరించేలా మార్కింగ్ చేశారు. దీంతో కొన్ని షాప్‌లను 10 ఫీట్ల మేర కూల్చివేయాల్సి ఉంటుంది. రహదారి విస్తరించాక డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీలు నిర్మించనున్నారు. అయితే, రహదారి వెడల్పులో నష్టపోయే వారికి పరిహారం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కారేపల్లి (సింగరేణి) మండలం గాదెపాడు అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న షేక్ మహబూబ్‌బీ ఇటీవల కామేపల్లి మండలం లింగాలలో మీటింగ్‌కు హాజరై వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) ఆధ్వర్యాన మంగళవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ సుభహాన్ మాట్లాడుతూ.. ఆమె కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. అలాగే అంగన్‌వాడీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లపై అధికారుల వేధింపులను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, ప్రగతిశీల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ నాయకులు శిరోమణి, పారిజాతం, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు భాను, గౌని మోహన్‌రావు, పటేల్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్' ఫీజుల నియంత్రణకు..

నేలకొండపల్లి: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు ఆప్ ఈస్ట్ జోన్ సభ్యుడు పసుమర్తి శ్రీనివాస్ మంగళవారం కలెక్టర్ అనుదీప్‌కు, డీఈఓ ఎస్.సత్యనారాయణలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతోనే 'ప్రైవేట్' బాట పడుతున్నారని, విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం రిజర్వేషన్ సీట్లు కేటాయించాలన్నారు. ప్రైవేట్ దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు బల్లల వితరణ

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు శ్రీ ఆంజనేయస్వామి, నేలకొండపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాలకు వాసవీ క్లబ్స్ ఆధ్వర్యాన బల్లలను వితరణ చేశారు. మంగళవారం డూ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా కొత్తా యోగనందరావు -రూపవతి, కొత్తా లక్ష్మీకాంతమ్మ- వీరరాఘవులు, కొత్తా సుశీల, జనార్దన్‌రావుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వీటిని అందించారు. దేవాలయం చైర్మన్ కనమర్లపూడి రమేష్, పూజారి తుపురాణి మధుసూదనాచార్యులు, నేలకొండపల్లి, వనిత భక్త రామదాసు, గ్రేటర్ క్లబ్, రాజేశ్వరపురం కన్యాకాపరమేశ్వరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నేలకొండపల్లి: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన స్థానిక ఉన్నత పాఠశాలలోటపెన్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు పేర్కొన్నారు. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లని వారు, చదువు మధ్యలో మానేసిన వారికి ఇదొక చక్కటి అవకాశమని, తమ విద్యార్హతలు పెంచుకునేందుకు ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్ కోసం ఆసక్తి కలిగిన వారు వచ్చే నెల 12 నుంచి ఆగస్టు 12 వరకు జనరల్ వారికి రూ.1,550, ఇతరులు రూ.1,150లు చెల్లించాలని సూచించారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జగదీష్

తిరుమలాయపాలెం: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు అలవాటు పడొద్దని ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్‌కు అలవాటు పడి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, యువతను పట్టిపీడిస్తున్న ఈ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఎం విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెసర ప్రభాకర్‌రెడ్డి, ధన మూర్తి, హమీద్, నాగేశ్వరరావు, హనుమంతు, శేష, శ్రీనివాసరావు, రఘుబాబు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోదండరామ్

నేలకొండపల్లి: తెలంగాణ జన సమితి(టీజేఎస్) వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ సమక్షంలో ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకులు పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో టీజేఎస్ కార్యాలయంలో ఖమ్మం జిల్లా ఉద్యమ జేఏసీ అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు, తీగ రాములు పార్టీలో చేరగా కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి జిల్లాలో పార్టీని మరింత పటిష్టంగా నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు, నాగేశ్వరరావు, బెల్లంకొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నేలకొండపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరపతిరెడ్డి మంగళవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని క్రైమ్, వివిధ కేసులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కూసుమంచి సీఐ సంజయ్, ఎస్సై సంతోష్ ఉన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి, నేలకొండపల్లి గ్రామాల్లో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాలను జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.రమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశాక టీకాల ప్రాముఖ్యత, మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ వీరన్న, రాణి, స్వాతి, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, తిరుపతమ్మ, సుభద్ర, సునీత తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్‌లో డ్రెయిన్ టు డ్రెయిన్ సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బైపాస్ రోడ్ నుంచి విశాల్ టవర్ వరకు నిర్మించనుండగా మంగళవారం పనులను కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పనుల ప్రణాళికను వివరించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న ర్యాంపులను తొలగిస్తూ పనులను చేపట్టినట్లు తెలిపారు.

రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని పలువురు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. మంగళవారం రైతు భరోసా నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ నాయకులు సంబరాలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పార్టీ అగ్ర నేతలు, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు.



ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శనీయమన్నారు. – సాక్షినెట్‌వర్క్



కామేపల్లి: పాలాభిషేకం చేస్తున్న నాయకులు



రఘునాథపాలెం: చింతగుర్తిలో..

ఘనంగా 'రైతు భరోసా' సంబరాలు



అల్లీపురం రైతు వేదికలో రుణమాఫీ పత్రాలను చూపిస్తున్న రైతులు, పాల్గొన్న మేయర్ నీరజ

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రైతు భరోసా సంబరాల్లో భాగంగా మంగళవారం నగరంలోని అల్లీపురం, రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెం, రఘునాథపాలెం, రాంక్యాతండా రైతు వేదికల్లో రైతు భరోసా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు పాల్గొన్న రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని రైతులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించారు. అల్లీపురం రైతు వేదికలో రైతులు తమకు లభించిన రుణమాఫీ పత్రాలను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పాల్గొనగా కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు రావూరి కరుణ, శరత్, సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, వెనిగండ్ల సత్యనారాయణ, ఎర్రబోయిన గోవిందు, వడ్డెపూడి మల్లేష్, ఏఓలు కిషోర్ బాబు, భాస్కర్, అరుణ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు. రఘునాథపాలెం రైతు వేదికలో వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగ్ల హనుమంతురావు, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్వేత, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం మండలంలో...



దమ్మాయిగూడెం రైతు వేదికలో పాల్గొన్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం, దమ్మాయిగూడెం బీరోలు రైతువేదికలలో రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఈఓలు బాలకృష్ణ, కరిష్మా, లంక రమేష్, ప్రదీప్, సాధన, ఉపేందర్ మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ కొప్పుల అశోక్, రామసహాయం అరవిందరెడ్డి, పోట్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మౌలిక సదుపాయాలు కరువు

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాలు అర్హులకు కాకుండా ఆ పార్టీ నాయకులకే ఇస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అరకొరగా రుణమాఫీ చేసిందని, రెండు దఫాలు రైతుభరోసా ఇవ్వకుండా ఇప్పుడు ఇచ్చి సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ రవీందర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల కృష్ణారెడ్డి, సామా మోహన్‌రెడ్డి, కాట్రాల రాంబాబు, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, ఆంతోటి అచ్చయ్య, అజ్మీరా రాజునాయక్, జాటోత్ జాయ్‌లూసీ, పుచ్చకాయల బాబు, ఉదయ్, ఆదూరి ప్రసాద్, దుద్దుకూరి రాంబాబు, ముత్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

ఇరాన్‌పై అమెరికా దాడికి నిరసన



ఖమ్మంమయూరిసెంటర్: నిరసన తెలుపుతున్న వామపక్షాల నేతలు

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: ఇజ్రాయిల్ గత 12 రోజులుగా ఇరాన్‌పై కొనసాగిస్తున్న యుద్ధానికి అమెరికా మద్దతు ఇవ్వడమే కాకుండా, స్వయంగా దాడి చేయడం సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్య అని వామపక్షాల నేతలు ఆరోపించారు. మంగళవారం సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు చేపట్టి అమెరికా అధ్యక్షుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈనేపథ్యాన ఖమ్మం నగరంలో వామపక్ష పార్టీ నేతలు ప్రదర్శన చేసి, బైపాస్ రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టగా, రఘునాథపాలెం మండలం మంచుకొండ సెంటర్‌లో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అలాగే ఖమ్మంఅర్బన్ మండలం ఖానాపురం హవేలీ పార్టీ కమిటీ ఆధ్వర్యాన ఇందిరానగర్ సెంటర్‌లో సీపీఎం నేతలు నిరసన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో విభజన సృష్టించి, వాటిపై ఆధిపత్యం చెలాయించాలన్న కుట్రలో భాగంగానే ఇజ్రాయిల్‌తో కలిసి అమెరికా ఈ దాడికి పాల్పడిందని, ఈ ఘటనలపై భారత్ ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులు, శాంతిని కోరేవారు అమెరికా–ఇజ్రాయిల్ దురాక్రమణలను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఖమ్మంలో జరిగిన నిరసనలో వామపక్ష పార్టీల నేతలు బాగం హేమంతరావు, దండి సురేష్, నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్లు, ఝూన్సీ, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, వై.విక్రమ్, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, బీజీ క్లెమెంట్, పోటు కళావతి తదితరులు పాల్గొనగా.. మంచుకొండలోమాస్ లైన్ జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయితో పాటు కేలోతు లక్ష్మణ్, పార్టీ మేఘ రామనాథం, కేలోత్ పాపారావు, జర్పుల దేవల, కురా కుల సరసయ్య, పుప్పాల రామారావు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్ సింగ్, డివిజన్ అధ్యక్షుడు ఇస్లావత్ రమేష్, చలమల లక్ష్మీనారాయణ, ధరావత్ ధర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందిరానగర్ సెంటర్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్యలతో పాటు గాలి వెంకటాద్రి, కత్తుల అమరావతి, పోతురాజు వెంకటి, కుర్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం: దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న మాస్‌లైన్ నాయకులు



ఖమ్మంఅర్బన్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు